# యెహోవా భయము – ఇంపైన సువాసన

**పరిమళ తైలము వంటి యేసయ్య నామమునకు మహిమ కలుగును గాక!**

**మూలవాక్యం:** యెషయా 11:3 **యెహోవా భయము అతనికి ఇంపైన సువాసనగా ఉండును.**

**పై లేఖనములో "అతనికి" అని వ్రాయబడియుంది. అతడు అనగా యేసుక్రీస్తు . యేసుక్రీస్తుని వాక్యం దేవుడు అని చెబుతుంది యేసుక్రీస్తు దేవుడైతే ఆయనకు యెహోవా భయమెందుకు? ఎందుకంటే ఆయన శరీరధారునిగా ఈ లోకంలోనికి వచ్చారు(యోహాను1:14), ప్రభువు హిత(మంచి) వత్సరము ప్రకటించటానికి (లూకా 4:19), తండ్రి పనుల మీద ఉండటానికి(లూకా2:49) వచ్చారు. మనకు భయభక్తులు నేర్పించడానికి, ఆయన పాటించి చూపించడానికి వచ్చారు.**

**యెహోవాయందు భయము కలిగియుండటం అనగా:-** సామె 8:13 యెహోవాయందు భయభక్తులు గలిగియుండుట చెడుతనము నసహ్యించుకొనుటయే.

**Ex:-** యోబు 1:1 ఊజు దేశమునందు యోబు అను ఒక మనుష్యుడుండెను అతడు . **యథార్థవర్తనుడును, న్యాయవంతుడునై దేవునియందు భయభక్తులు కలిగి చెడుతనము విసర్జించినవాడు.**

**దైవభయం అంటే ఏంటో పైన దేవుని వాక్యం మనకు తెలియజేసింది. అది మనకందరికీ అనుభవపూర్వకంగా తెలుసు, కాని చాలా మందికి తద్వారా వచ్చే మేలులు తెలియటం లేదు.**

**దేవుని పట్ల భయము, భక్తి ఉంటే ప్రయోజనాలు ఏంటి?**

1. **యెహోవాను సేవించవచ్చు, సంతోషించవచ్చు :** కీర్తన 2:11 భయభక్తులు కలిగి యెహోవాను సేవించుడి. గడగడ వణకుచు సంతోషించుడి.
2. **జనులు మనలను సన్మానిస్తారు :** కీర్తన 15:4 అతని దృష్టికి నీచుడు, అసహ్యుడు అతడు యెహోవాయందు భయభక్తులు గల వారిని సన్మానించును. అతడు ప్రమాణము చేయగా నష్టము కలిగినను మాట తప్పడు.
3. **దేవుడే మనకు బోధిస్తారు :** కీర్తన 25:12 యెహోవాయందు భయభక్తులు గలవాడెవడో వాడు కోరుకొనవలసిన మార్గమును ఆయన వానికి బోధించును.
4. **మర్మము మనకు తెలియజేయబడుతుంది :** కీర్తన 25:14 యెహోవా మర్మము ఆయనయందు భయభక్తులు గల వారికి తెలిసియున్నది. ఆయన తన నిబంధనను వారికి తెలియజేయును.

5. **దాచియుంచిన మేలు వస్తుంది: కీర్తన 31:19** నీయందు భయభక్తులు గల వారి నిమిత్తము **నీవు దాచి యుంచిన మేలు యెంతో గొప్పది**. నరుల యెదుట నిన్ను ఆశ్రయించువారి నిమిత్తము నీవు సిద్ధపరచిన మేలు ఎంతో గొప్పది.

6. **సన్నిధి దూత కావలి కాస్తుంది : కీర్తన 34:7** **యెహోవాయందు భయభక్తులు గలవారి చుట్టు ఆయనదూత కావలియుండి వారిని రక్షించును.**

7. **మేలుకు కొదువ లేదు : కీర్తన 34:9,10** యెహోవా భక్తులారా, ఆయనయందు భయభక్తులు ఉంచుడి. **ఆయన యందు భయభక్తులు ఉంచువానికి ఏమియు కొదువలేదు.** సింహపు పిల్లలు లేమిగలవై ఆకలిగొనును **యెహోవాను ఆశ్రయించువారికి ఏ మేలు కొదువయై యుండదు.**

8. **దేవునిని చూచి సంతోషిస్తారు : కీర్తన 119:74** నీ వాక్యము మీద నేను ఆశపెట్టుకొనియున్నాను. **నీయందు భయభక్తులు గల వారు నన్ను చూచి సంతోషింతురు.**

9. **క్షమాపణ దొరుకుతుంది : కీర్తన 130:4** అయినను జనులు నీయందు భయభక్తులు నిలుపునట్లు **నీయొద్ద క్షమాపణ దొరుకును.**

10. **కోరికలు నెరవేరుతాయి : కీర్తన 145:19** **తనయందు భయభక్తులు గల వారి కోరిక ఆయన నెరవేర్చును.** వారి మొఱ్ఱ ఆలకించి వారిని రక్షించును.

11. **తెలివికి మూలము : సామె 1:7** **యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట తెలివికి మూలము.** మూర్ఖులు జ్ఞానమును ఉపదేశమును తిరస్కరించుదురు.

12. **జ్ఞానమునకు మూలము : సామె 9:10** **యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట జ్ఞానమునకు మూలము.** పరిశుద్ధ దేవుని గుర్చిన తెలివియే వివేచనకు ఆధారము.

13. **దీర్ఘాయువు : సామె 10:27** **యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట దీర్ఘాయువునకు కారణము** భక్తిహీనుల ఆయుస్సు తక్కువై పోవును.

14. **బహు ధైర్యము పుట్టించును : సామె 14:26** **యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట బహు ధైర్యము పుట్టించును.**

15. **జీవపు ఊట : సామె 14:27** అట్టివారి పిల్లలకు ఆశ్రయస్థానము కలదు .**యెహోవా యందు భయభక్తులు కలిగియుండుట జీవపు ఊట** అది మరణపాశములలోనుండి విడిపించును.

16. **జీవ సాధనము : సామె 19:23** **యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట జీవ సాధనము** అది కలిగిన వాడు తృప్తుడై అపాయము లేకుండ బ్రదుకును.

17. **కొనియాడబడుదురు : సామె 31:30** అందము మోసకరము, సౌందర్యము వ్యర్థము **యెహోవాయందు భయభక్తులు కలిగిన స్త్రీ కొనియాడబడును.**

18. **మన మాటలు దేవుడు విని గ్రంధంలో వ్రాయిస్తారు : మలాకి 3:16** అప్పుడు, యెహోవాయందు భయ భక్తులుగలవారు ఒకరితో ఒకరు మాటలాడుకొనుచుండగా యెహోవా చెవియొగ్గి ఆలకించెను మరియు **యెహోవా యందు భయభక్తులుకలిగి ఆయన నామమును స్మరించుచు ఉండువారికి జ్ఞాపకార్థముగా ఒక గ్రంథము ఆయన సముఖమునందు వ్రాయబడెను.**

19. **మనకు నీతి సూర్యుడు ఉదయిస్తాడు : మలాకి 4:2** అయితే **నా నామమందు భయ భక్తులుగలవారగు మీకు నీతి సూర్యుడు ఉదయించును;** అతని రెక్కలు ఆరోగ్యము కలుగజేయును గనుక మీరు బయలుదేరి క్రొవ్విన దూడలు గంతులు వేయునట్లు గంతులు వేయుదురు.

20. **మనము అంగీకరించబడతాము : హెబ్రీ 5:7** శరీరధారియైయున్న దినములలో మహా రోదనముతోను కన్నీళ్లతోను, తన్ను మరణమునుండి రక్షింపగల వానికి ప్రార్థనలను యాచనలను సమర్పించి, **భయభక్తులు కలిగి యున్నందున ఆయన అంగీకరింపబడెను.**

21. **రక్షణ ఓడ ఇంటి వారి కొరకు సిద్దపరచుకుంటాం : హెబ్రీ 11:7** విశ్వాసమునుబట్టి నోవహు అదివరకు చూడని సంగతులను గూర్చి దేవుని చేత హెచ్చరింపబడి **భయభక్తులు గలవాడై, తన యింటివారి రక్షణకొరకు ఒక ఓడను సిద్ధముచేసెను;** అందువలన అతడు లోకముమీద నేరస్థాపన చేసి విశ్వాసమును బట్టి కలుగు నీతికి వారసుడాయెను.

**యెహోవా భయము యేసుక్రీస్తుకు ఇంపుగా వున్నట్లు మనకు కుడా దైవభయము ఇంపుగా వుండాలి. అలాగే మనం చేసే పనులు దేవునికి ఇంపుగా వుండాలి. అవి ఏమిటో వాక్యములో చూద్దాం.**

1. **దైవ మార్గములు ఇంపుగా ఉండాలి : సామె 23:26** నా కుమారుడా, నీ హృదయమును నాకిమ్ము **నా మార్గములు నీ కన్నులకు ఇంపుగా నుండనిమ్ము,**
2. **దేవుని గుర్చిన ధ్యానం ఇంపుగా ఉండాలి : కీర్తన 104:34** **ఆయనను గూర్చిన నా ధ్యానము ఆయనకు ఇంపుగా నుండును** గాక నేను యెహోవాయందు సంతోషించెదను.
3. **దేవుని పాటలు, సంగీతము ఇంపుగా ఉండాలి : కీర్తన 33:3** **ఆయనను గూర్చి నూతనకీర్తన పాడుడి ఉత్సాహధ్వనితో ఇంపుగా వాయించుడి.**
4. **దేవునికి అర్పించే బలి(స్తోత్ర బలి) ఇంపుగా ఉండాలి : ఆది 8:21** అప్పుడు **యెహోవా ఇంపయిన సువాసన** నాఘ్రాణించి ఇక మీదట నరులను బట్టి భూమిని మరల శపించను. ఎందుకనగా నరుల హృదయాలోచన వారి బాల్యము నుండి చెడ్డది నేనిప్పుడు చేసిన ప్రకారముగా ఇకను సమస్త జీవులను సంహరింపను.




**ALERTS :- లోకస్తులకు యెహోవా భయము కాక వేరేవి ఇంపుగా ఉంటాయి. అవి ఏంటంటే ...**

- **మోసము చేసి తెచ్చుకొన్న ఆహారము బహు ఇంపుగా ఉండును:** సామె 20:17 **మోసము చేసి తెచ్చుకొన్న ఆహారము మనుష్యులకు బహు ఇంపుగా ఉండును** పిమ్మట వాని నోరు మంటితో నింపబడును.
- **మంటి పెల్లలు వారికి ఇంపుగా ఉన్నవి :** యోబు 21:32,33 వారు సమాధికి తేబడుదురు సమాధి శ్రద్ధగా కావలి కాయబడును పల్లములోని **మంటి పెల్లలు వారికి ఇంపుగా నున్నవి** మనుష్యులందరు వారి వెంబడి పోవుదురు ఆలాగుననే లెక్క లేనంత మంది వారికి ముందుగా పోయిరి.

**కీర్తన 34:11 లో పిల్లలారా, మీరు వచ్చి నా మాట వినుడి. యెహోవాయందలి భయభక్తులు మీకు నేర్పెదను అని వ్రాయబడింది. అందరు వచ్చి ఆలకించండి అని కీర్తన 66:16 "దేవుని యందు భయభక్తులు గలవారలారా, మీరందరు వచ్చి ఆలకించుడి ఆయన నా కొరకు చేసిన కార్యములను నేను వినిపించెదను"లో ఉంది. అందరు వచ్చి ఆలకించి, నేర్చుకొనే సమయమే lent కాలం. భక్తి శ్రద్ధలతో దీనిని ఆచరిద్దాం. సర్వశక్తుడైన దేవుడు మనకు సహాయం చేస్తారు.**

**భయభక్తులు వినడం మాత్రమే కాదు, నేర్చుకోవాలి, ఆచరించాలి. ప్రభువైన క్రీస్తు తల్లిదండ్రులకు లోబడి జీవించారు. ఆ రీతిగా దేవుని ఆజ్ఞను పాటించారు. వాడుక చొప్పున సమాజమందిరములో వాక్యము చదివారు, గ్రామంలో, పట్టణంలో, సువార్త ప్రకటించారు, వ్యాధిగ్రస్తులను బాగుచేశారు, ఉపవాసమున్నారు, కన్నీరు విడిచారు దేవునికి విజ్ఞాపన చేశారు.**

**అవమానం, నింద, శ్రమ భరించారు, ఎవరిని ఏమి అనలేదు. ఆయన జీవితం ప్రత్యేకం, పరిశుద్ధం, ప్రతిష్ఠితం, మనల్నందర్నీ ఆయన వలే ఉండమన్నారు. అదే భయభక్తులుగల జీవితం. అది నేర్చుకోవాలి, నేర్చుకుంటూనే ఉండాలి. అప్పుడే మన జీవితం దేవునికి ఇంపు, లేదంటే కంపు.**

**పరిశుద్ధాత్మ దేవుడు మిమ్మల్ని ఇంపైన వారిగా మార్చును గాక... ఆమెన్..ఆమెన్...ఆమెన్...**